# ★ విచారణ ★

తిగెల గోపిచంద్

—.o:—

ఉద్రేకంతో అరుస్తూన్న ఆయువకుని అరుపులకు న్యాయస్థానం దద్దరిల్లిపోయింది. చివరకి న్యాయాధిపతితో సహా! ఆయువకుని వయస్సు షుమారు 20 సంవత్సరాలుండొచ్చు. ఇవ్వాళ ప్రొద్దున్నే బంధింపబడ్డాడు నేరం తన ముసలి తల్లి నిండుప్రాణి తీయటానికి ప్రయత్నించాడు- లోకం కస్సుమని విరుచుకు పడింది తనమీద— కత్తి చేతిలో వుండగానే పోలీసులతన్ని అరెస్టు చేశారు ఇంకా అరుస్తూనే ఉన్నాడతను.

"విన్నారా మీరంతా! తప్పకుండా నన్ను వురి తీయించాలి. నాతల్లి విగూ కా లేకపోతే నాతల్లి కష్టాలెక్కువవుతాయ్! నాఆత్మకు శాంతి వుండదు ... తీయించండి చూస్తారేం"

"ఇంత మాతృప్రేమ గలవాడివి ఆమెనుహత్య చేయటానికి సాహసించా వెందుకూ" జడ్జి ఆనందుండు ప్రశ్నించాడు-

"ఔను మాతృప్రేమే ఆమెను చంపించేందుకు త్వరపెట్టింది ఊహా తెల్సినప్పటినుంచీ నేను నాతల్లిని ఎంతో ఎక్కువగా ప్రేమించాను. తన రక్తమాంసాలు నాకోసం ధారపోస్తూ నాకోసం తన జీవితాన్నే త్యాగం చేసుకొంటూంది. ఆమె కష్టాలు చూడలేక పొయ్యాను మీముందరకు తేబడ్డాను" కళ్ళనీళ్ళతో తలవంచు కొన్నాడు-

అనుభవజ్ఞుడయిన జడ్జి శాంతంగా ప్రశ్నించాడు—"అబ్బాయ్ నీతండ్రి?"

"ఆరెండక్షరాల్లేక పోవటమే మాకష్టాలకు కారణం" తలవంచు కున్నాడు-

అకస్మాత్తుగ జడ్జిమొహం తెల్లబడింది వెం ... [illegible]

"తండ్రి లేకపోవడం" రెండుసార్లు తనలో తను అనుకున్నాడా నందుడు-

ఔను నాలాంటివాళ్ళే లోకంలో సుదురుపట్టు కాని ప్రశ్నించుకొన్నాడు- తలచుకొన్న కొద్దీ గత జీవితమంతా అతనిబుర్రలో గిర్రున తిరగటం మొదలుపెట్టింది.

అమెరికానుంచి విద్య ముగించుకు వచ్చాడు తాను, వచ్చిన కొత్తరోజుల్లోనే అతని జీవితంలో మార్పు ప్రవేశింప మొదలుపెట్టింది, లోకం బహిష్కరించిన ఒక అనాథజీవితాన్ని సంస్కరించటమే ఈమార్పు- తాను అమెరికాకు పొయ్యే ముందు శ్యామల అనేపదం తనయింట్లోకనుపించలేదు. వచ్చినప్పటినుంచీ ఆమె జీవితచరిత్రను తెలుసుకోవడమే గాకుండా మననం చేసుకోడం కూడా ప్రారంభించాడు ఆనంద్ తన దూరపు బంధువుల్లో వెలివేయబడిన ఒబీదవాడి ఏకైక పుత్రిక శ్యామల- ఒక్క బీదవాడే కాదు- పచ్చి త్రాగుబోతు? తండ్రి భార్యను ఎప్పుడో ఇంకో లోకానికి పంపించేశాడు_ ఇక శ్యామల విషయం క్రుంగిపోక ఏమవుతుంది? బాల్యంలోనే శ్యామల వివాహిత అయి వెంటనే విధవగూడా అయింది పాపం. అటువంటి విష సమయంలోనే అండగా వున్న పెద్ద గుటుక్కుమన్నాడు. ఆమె పరిస్థితి మరీ ఘోరమయింది- దిక్కులేని ఆపసిపిట్ట ఎగరలేదు, కష్టాల్లో కష్టాలు- తన యౌవనాన్ని ఆశించి కాచుకొనివున్న కొన్ని వేటకుక్కలు తరమటం ప్రారంభించినప్పు, తనతండ్రిని సంఘంలో [illegible]

లేదు! రోజులు గడవటమే దుర్లభమయింది శ్యామలకు. ఎవరితో చెప్పుకుంటుంది తన దీనావస్థను గురించి? కొంతకాలం నిరీక్షించి ఆఖరకు తన పూర్వ బంధువర్గానికి చెందిన ఓధనవంతుని వద్దకు పోయి తనబ్రతుకు కోసం మొరపెట్టుకొంది. మొదట అతడంగీక రించడానికి సాహసించ లేక పోయినా ఆమెను ఇంటిపనులు చేయడానికి నియమించాడు. అతఃపాతాళానికి త్రొక్కబడిన శ్యామల జీవితానికి ఒకమెట్టు అందినంత తృప్తి గల్గింది. అప్పటినుంచీ కష్టపడి పనిచేస్తూ పొట్టను పోషించుకొంటూ, మరొకవంక తనభావిజీవితాన్ని గూర్చి ఆలోచింప సాగింది. ఎంత ఆలోచించినా ఆమె హృదయానికి తృప్తి కలగదు. భవిష్యత్తు అంధకారంగా గోచరింప సాగేది ఆమెకు ఒక్కొప్పుడు- తనయింటి యజమానికి తనమీద అనుగ్రహం కల్గితే తనజీవితానికి ఒందారి చూపించవచ్చు. ఆశలేందే ఈ ప్రపంచంలో జీవించడం కష్టం. ఆఆశనుతలచుకొని ఆమెగుటకలుమ్రింగు కొనేది.

ఇట్లా కొంతకాలం గడిచింది చరిత్ర హీనురాలి జీవనరంగంలో! అమెరికా వెళ్ళిన ఆనందుడు, అంటే ఆయింటి యజమాని తమ్ముడు చదువు ముగించుకొని స్వగృహానికి వచ్చాడు— ఇంట్లోవున్న శ్యామలను చూచే చూడటం ఆమె జీవితాన్ని గుర్తింప సాగాడు ఆనందుని వంటి వారికి ఇటువంటి హృదయార్ద్రిత విశాల దృష్టి లేకపోతే శ్యామలవంటి అనాథలకీ ప్రపంచంలో న్యాయం కలిగేదికాదు. దిక్కులేని అదీనురాలిచరిత్ర దయార్ద్రహృదయంగల ఆనందునిలో మార్పు తెచ్చిపెట్టి అతనిక్కితెలియకుండానే ఆమె మీద జాలీ, సానుభూతీ, చివరకు ప్రేమ చిగురించడం మొదలిడినయ్. మరుగున పడివున్న ఒక నగ్నజీవితాన్ని గుర్తించాడతడు. మరి శ్యామల మాత్రం ఆనందుని అర్థం చేసుకోకుండా వుంటుందా? అప్పటినుంచి శ్యామల జీవనాంబరంలో వెన్నెలరాత్రులు ప్రవేశింప ప్రారంభించినయ్! ఇప్పుడా యింటివారి దృష్టిలో ఆమెపనికత్తె— కాని ఆనందుని దృష్టిలో పవిత్రప్రేమ స్వరూపిణి. అతఃపాతాళానికి క్రుంగిన ఆమెజీవితం ఇప్పుడు మహోన్నత సౌధానికి తీసుకురాబడిందొక విశాల హృదయుని చేత!

కాలం ఒకేరీతిగా నడుస్తే ఇంకేం? రోజులు గడిచినకొద్దీ శ్యామల జీవితంలో మరలా చీకటి రాత్రులు రావటం మొదలుపెట్టాయి పాపం! చరిత్రహీనుల జీవితాలన్నీ ఈమాదిరే ఎక్కువ కష్టాలతో నిండివుంటయ్? ఆమె యిప్పుడు పూర్ణ గర్భవతి అవటమే ఆచీకటిరాత్రికి కారణం! కాని ఆనందుడు మాత్రం వూరుకొంటాడా? ఒకరోజు అన్నగారిని కలుసుకొని శ్యామలను వివాహమాడ్తానని చెప్పాడు ఈసంగతివిని అతడు మహోగ్రుడయ్యాడు "ఇంట్లో దాసీవలెవున్న ఒక కళంకిణిని వివాహమాడి వంశగౌరవాన్ని మంటలో కూల్చాలంటే నేను ఒప్పుకోను" ఇదేనిక్కచ్చిగ అతనిజవాబు. ఎన్నో చెప్పాడు. బోధించాడు. ఆమెశీలవతిఅని రుజువుగూడాచేశాడు. కాని అన్న చెక్కు చెదరలేదు. చివరకు ఆనందుడు అన్నను ఎదిరించాడు. అన్నదమ్ము లిద్దరూ చివరికీవిషయంలో కయ్యానికిగూడా సిద్ధమయ్యారు. దిన దినం వృద్ధవుతున్న విరోధం శ్యామల హృదయాన్ని గాయపరిచింది తనకోసం ఒక పెద్ద తుపాను రాబోతుందాయింట్లో! ఇక సహించలేక పోయింది. అంతానిద్రిస్తున్న ఒకనాటి రాత్రిసమయంలో ఆనందుని పాదాలకు మ్రొక్కి ఇల్లువిడిచి వెళ్ళిపోయింది. ఆనందుని కొక్కసారి ప్రపంచమంతా అంధకారంగా కన్పించింది. తన మంచికోసం తన శ్యామల విడిచిపోయింది. తన శ్రేయస్సుకోసం, దానికితోడు గర్భిణి! అతని బుర్రంతా భయంకర అగ్ని గుండంలోపెట్టి కాల్చినట్లు యింది. అప్పటినుంచి ఆనందుని హృదయం తీవ్రమైన వేదన, విచారాల్తో నిండింది.

అశాంతితో అట్లాగే కాలం గడుపుతున్నాడు ఇప్పటికీ" కూర్చున్న సోఫాఅంతా అతని కన్నీళ్ళతో తడిసిపోయింది.

"నాలాంటివాళ్ళ ద్రోహమే ఈ యువకుల శిక్షలు ఔను తప్పకుండా" అటూ ఇటూ పచార్లుచేస్తూ వూరికే గొణగటం ప్రారంభించాడానందుడు. మళ్లీ ఆనేరంచేసిన యువకుణ్ని రప్పించాడు.

"నాయనా . నిజమే నువ్వింటాక కోర్టులో చెప్పింది నిజమే. తప్పకుండా" కళ్ళనీళ్లు కన బడకుండా చేతిరుమాల్తో ఒత్తుకుంటూ అడిగాడు.

"నన్ను హేళన " అర్ధోక్తిలోనే ఆగాడు.

" కాదు నాయనా హేళనకాదు. ముమ్మాటికీ నిజం! నాకు ఇటువంటివి అర్థమవుతయ్ నీతండ్రి ఎవరో చెప్తే . నాసాధ్యమైనంత వరకు ప్రయత్నిస్తా అతనికి బుద్ధి" తల త్రిప్పేసుకొన్నాడు ఒకవైపుకి .

"నేను పుట్టినప్పటి నుంచీ ఆమాటే ఎరగను. తల్లిపేరు శ్యా . ."

'ఆగు' అతనిమామాట పూర్తికాకముందే జడ్జి ఘట్టిగాఅరచి చటాలున ఆయువకుడిని కౌగలించుకొన్నాడు కారే కన్నీళ్ళ ప్రవాహంతో.

అంతే . మళ్లీ ఇనందుని జీవితంలో మంగళప్రదమయిన వెన్నెలరాత్రులు ప్రవేశించినయ్. ఇప్పుడా న్యాయాధిపతి యిల్లు నిత్యవైభవంగా కళకళ లాడ్తుంది. గోడను పెద్దఫొటో వ్రేలాడ్తూంది ఆనందుడు శ్యామల వారి కొడుకు—ఆఫొటోలో.

PANDYAN INSURANCE COMPANY LIMITED

పాండియన్ ఇన్స్యూరెన్సు

కంపెనీ, లిమిటెడ్.

(ఇండియాలో స్థాపితము 1933)

ఉన్నత సేవ చేయుచున్నది

అగ్ని, నావిక, మోటారు, ప్రమాదముల భీమా

మొదలగు భీమాలను నిర్వహించును.

మొత్తం ఆస్తులు రూ, 76,00,000 దాటినవి

హెడ్డాఫీసు మధుర

బ్రాంచీలు బొంబాయి, అహమ్మదాబాదు. కలకత్తా, నాగపూరు

ప్రిన్సిపల్ ఏజంట్లు మెసర్సు ఏ. & ఎఫ్ హార్వీ లిమిటెడ్ మధుర

మెసర్సు కె. ఎం. ఎ. లక్ష్మణయ్య అండు సన్సు లిమిటెడ్ మధుర

మధుర, తిండివనం, మద్రాసు, నగరి, బెజవాడ, కాకినాడ విజయనగరం సిటీ,